క్లుప్తంగా

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామంలో త్రైతసిద్ధాంత భగవద్గీతపై హిందూ ధర్మప్రచార ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఆ సేవాసమితి అధక్షుడు శంకరరావు మాట్లాడుతూ సృష్టికి మూలం, వాటి రహస్యాలు త్రైతసిద్ధాంత భగవద్గీతలో ఉన్నాయన్నారు. ఆపదలో ఉన్న వారికి సహాయం చేయాలని సూచించారు. సేవాసమితి సభ్యులు ప్రసాద్, భానుమతి, ఉపేంద్ర,నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత



చెక్ అందజేస్తున్న వంశీకృష్ణ, తదితరులు

చీపురుపల్లి: మండలంలోని రావివలస పంచాయతీ పరిధి నాగంపేట గ్రామానికి చెందిన యువకుడు కొమ్ము సీతారాం శేఖర్‌కు రూ.1.40 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ను పట్టణంలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ తనయుడు బెల్లాన వంశీకృష్ణ మంగళవారం అందజేశారు. వంశీకృష్ణ మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేదలను సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ఎంతగానో ఆదుకుంటోందని అన్నారు. రామలింగాపురం పీఏసీఎస్ అధ్యక్షుడు పనస అప్పారావు, నాయకులు కొమ్ము చిరంజీవి, పనస వెంకట్, కొమ్ము దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 41 మంది ఎంపిక



ఎంపికైన వారికి నియామకపత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణాజీ, వైస్ ప్రిన్సిపాల్ గోవిందరావు

చీపురుపల్లి: స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, కళాశాల జేకేసీ సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన మినీ జాబ్‌మేళాలో 41 మంది ఉద్యోగ అవకాశాలు పొందారని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి. కృష్ణా జీ తెలిపారు.హెటిరో డ్రగ్స్,డెక్కన్ కెమికల్స్ కంపెనీలు ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. హెటిరో డ్రగ్స్ కంపెనీకి 19 మంది, డెక్కన్ కెమికల్స్ కంపెనీకి 22 మంది ఎంపికయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు కళాశాల ప్రిన్సిపాల్ నియామకపత్రాలను అందజేశారు.వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గోవిందరావు, అధ్యాపకులు బి.ప్రసాదరావు, జ్వాలాముఖి తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం



ఇళ్ల పట్టాల పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: పేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అన్నారు. మండలంలోని చిననడిపల్లి గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ సీఎం జగన్ ఇంటి స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. నాయకులు పతివాడ రాజారావు, గడి రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఓటర్ల సర్వే



దేవుపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రసాదరావు

బొండపల్లి: ఓటర్ల జాబితాపై ఇంటింట సర్వేను పక్కాగా నిర్వహించాలని బీఎల్‌ఓలకు(బూత్‌లెవెల్ ఆఫీసర్లు) తహసీల్దార్ డి.జి.ఎం.ఎస్.ప్రసాదరావు సూచించారు. మండలంలోని దేవుపల్లి గ్రామంలో బీఎల్‌ఓలు మంగళవారం నిర్వహించిన ఇంటింట సర్వేను తహసీల్దార్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రతీ ఇంట్లో ఓటరు వివరాలు జాబితాలో సరిగా ఉన్నాయా లేదా అన్నది పరిశీలించాలని, తప్పులు ఉంటే సవరించాలని చెప్పారు. అలాగే 2024 జనవరి నాటికి 18 ఏళ్లు పూర్తయ్యేవారితో ఓటు హక్కుకు దరఖాస్తు చేయించాలని సూచించారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే అప్పలనరసయ్య
- బీటీ రోడ్డు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన మజ్జిపేట గ్రామస్తులు



దత్తిరాజేరు: గొభ్యాంలో మహిళకు పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

దత్తిరాజేరు: ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్లలా భావించి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని గజపతినగరం ఎమ్మె ల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని గొభ్యాం గ్రామంలో మంగళవారం ఉదయం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక, మండల ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమ పథకాల ద్వారా ప్రతీ కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో శ్మశానానికి, పొలాలకు వెళ్లేందుకు రోడ్డు, ఎరం చెరువు–పెద్ద చెరువుల మధ్య కల్వర్టు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఎస్సీ కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ కల్వర్టు నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని ఇరిగేషన్ డీఈ పాండును ఫోన్‌లో ఆదేశించారు. అలాగే గ్రామంలో విద్యుత్ సంబంధిత సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఈ ఆదిత్యను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, పాఠశాలలు, ఆస్పత్రుల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సచివాలయాల ద్వారా ప్రజలకు ప్రభుత్వసేవలు, రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు గ్రామాల్లోనే అందిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో అరకొరగా అమలు చేసిన పథకాలు సైతం అర్హులకు అందేవి కాదని, జన్మభూమి కమిటీలకు లంచాలు ఇచ్చే వారికి, టీడీపీ సానుభూతి పరులకు మాత్రమే అందేవని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పార్టీలకు అతీతంగా అర్హులకు పథకాలు అందుతున్నాయని చెప్పారు. టీడీపీ పాలనలో పింఛన్ డబ్బులు తీసుకునేందుకు అవ్వాతాతలు పంచాయతీ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు ఆపరిస్థితి లేదని వలంటీర్లు ప్రతినెలా ఉదయాన్నే తలుపుతట్టి పింఛన్ డబ్బులు అందజేస్తున్నారని అన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

గొభ్యాంలో కార్యక్రమం ముగించుకుని మజ్జిపేట గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యేకు ఆ గ్రామ మహిళలు హారతులు పట్టారు. ఆ గ్రామానికి తారురోడ్డు కోసం రూ.98.60 లక్షలు మంజూరు చేసి, పనులు చేయిస్తుండడం గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎవరికీ రూపాయి లంచం ఇవ్వకుండానే సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని గ్రామస్తులు ఎమ్మెల్యేకు చెప్పారు. గొభ్యాం సర్పంచ్ వంగపండు లక్ష్మునాయుడు, ఎంపీటీసీ కృష్ణమూర్తినాయుడు, ఏఎంసీ చైర్మన్ ముత్యాలనాయుడు, ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కడుబండి రమేష్‌నాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ ఫణీంద్రుడు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నేడు గొల్లుపాలెంలో...

బొండపల్లి: మండలంలోని గొల్లుపాలెం గ్రామంలో బుధవారం ఉదయం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ చల్లా చలంనాయుడు తెలిపారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పాల్గొంటారని, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరు కావాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

- అధికారులకు జెడ్పీ చైర్మన్ ఆదేశం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

మెరకముడిదాం: మండలంలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని గృహనిర్మాణశాఖ అధికారులను జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల మండల అధికారులతో మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా చేపడుతున్న ఇంటింట తాగునీటి కుళాయిల ఏర్పాటు పనులను త్వరగా పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పార్వతిని చైర్మన్ ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలని ఏఓ శ్రావణితేజకు సూచించారు. ఇప్పలవలస గ్రామంలో ఒకే ట్రాన్స్‌ఫార్మర్ మీద 35 వ్యవసాయ పంపుసెట్లు నడుస్తుండడంతో సమస్య తలెత్తుతోందని రైతులు చెబుతున్నారని, అక్కడ మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని, మీరాచిపేటలో లోవోల్టేజ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని విద్యుత్ శాఖాధికారులను ఆదేశించారు.ఎంపీడీఓ ఎం.రత్నం, తహసీల్దార్ విజయభాస్కర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, కె.ఎస్.ఆర్.కె .ప్రసాద్ పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై నిరసన



ఎస్.కోటలో రాస్తారోకో చేస్తున్న సీపీఐ నాయకులు

శృంగవరపుకోట: మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనపై నిరసన తెలుపుతూ సీపీఐ నాయకులు స్థానిక దేవి జంక్షన్‌లో మంగళ వారం రాస్తారోకో నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలపై అత్యాచారం, నగ్నంగా ఊరేగించిన ఘటనలను సుప్రీం కోర్టు సుమోటోగా తీసుకుని కేసు నమోదు చేసేంత వరకు కేంద్ర ప్రభుత్వం ఏం చేస్తోందని, మహిళలపై ప్రదాని మోదీకి ఉన్న గౌరవం ఇదేనా అంటూ ప్రశ్నించారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకూ సీపీఐ దేశవ్యాప్తంగా పోరాటాలు చేస్తుందన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు మద్ది కృష్ణ మాట్లాడుతూ మణిపూర్‌లో అల్లర్ల వల్ల 160 మంది చనిపోయినా, 84రోజులుగా అల్లర్లు జరుగుతున్నా కేంద్రం వేడుక చూస్తోందని విమర్శించారు. కార్గిల్ యుద్ధంలో నాడు దేశాన్ని రక్షించిన వీరుడు నేడు మణిపూర్‌లో తన భార్యను రక్షించుకోలేని స్థితిని చూస్తే దేశంలోనూ, మణిపూర్‌లో బిజెపి పాలన ఎలా ఉందో తెలుస్తోందన్నారు. డేగల అప్పలరాజు, షేక్‌స్వామి, మోపాడ మధు ,వి.గోపి, కె.భీముడు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా గౌరవాధ్యక్షురాలు మద్ది మాణిక్యం, షేక్ చాంద్‌బీబీ పాల్గొన్నారు.

గజపతినగరంలో..

గజపతినగరం: మణిపూర్ ఘటనపై సీపీఐ ఏరియా కార్యదర్శి మహదేవ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గజపతినగరం నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద సీపీఐ నాయకులు మంగళవారం నిరసన తెలిపారు.మహిళలకు రక్షణ కల్పించలేని ప్రభుత్వాలు ఎందుకని వారు మండిపడ్డారు. సీపీఐ నాయకులు గేదెల రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రెల్లి గ్రామంలో 'ఫ్యామిలీ డాక్టర్'



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సీతామహలక్ష్మి

కొత్తవలస: మండలంలోని రెల్లి గ్రామంలో కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారి సీతామహలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా స్థానిక సచివాలయ ప్రాంగణంలో శిబిరం ఏర్పాటు చేసి ఓపీ (అవుట్ పేషెంట్) సేవలందించారు. 56 మందికి వైద్యతనిఖీలు,15 మందికి రక్త పరీక్షలు చేశారు. అలాగే గర్భిణులకు వైద్యపరీక్షలు చేసి, పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను సందర్శించి చిన్నారులు, విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నదీ లేనిది, ఎత్తుకు తగ్గ బరువు ఉన్నరా లేదా అని పరిశీలించారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

శృంగవరపుకోట: ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం నెలకొందని పర్యావరణ ప్రేమికుడు స్థానిక 'జియో'(గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్) వ్యవస్థాపకుడు బి.రామకృష్ణ అన్నారు.స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో 'పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకత' ఉపాధ్యాయులకు ఆయన వివరించారు. కాలుష్యం వల్ల భూతాపం, ఉష్ణోగ్రతలు ప్రమాదస్థాయికి పోతున్నాయని అన్నారు. ప్రమాద తీవ్రతను విద్యార్థులకు అర్థం అయ్యేలా వివరించి, మొక్కలు నాటడం, సంరక్షించడం వారికి అలవాటు చేయాలని ఉపాధ్యాయులను కోరారు.

జగనన్న సురక్ష..

ప్రజలకు శ్రీరామరక్ష



కొత్తవలస: కొత్తవలస సచివాలయం–4లో మహిళకు ధ్రువపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా రూపొందించి అమలు చేస్తున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమం ప్రజల పాలిట శ్రీరామరక్ష అని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. 11 రకాల ధ్రువపత్రాల మంజూరుతో పాటు అర్హత ఉండి ఎవరికైనా సాంకేతిక సమస్యల వల్ల పథకాలు అందకుంటే సమస్యలు పరిష్కరించి పథకాలు వర్తించేలా చేసేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. గజపతినగరం, ఎస్.కోట, చీపురుపల్లి నియోజకవర్గాల్లోని పలుగ్రామాల్లో మంగళవారం 'జగనన్న సురక్ష' క్యాంపులు నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజలకు 11 రకాల ధ్రువపత్రాలను ఉచితంగా అందజేశారు. కొత్తవలస మేజర్ పంచాయతీ సచివాలయం–4 లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, వైఎస్సార్‌పీ రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం, శృంగవరపుకోట సచివాలయం–3, 1లలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



గుర్ల: నడుపూరులో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు



గుర్ల: కెల్లలో యువకుడికి ధ్రువపత్రం అందజేస్తున్న నాయకులు సూర్యనారాయణరాజు, సన్యాసినాయుడు



గంట్యాడ: కొర్లాంలో మహిళకు ధ్రువపత్రం అందజేస్తున్న నాయకుడు జైహింద్‌కుమార్, తదితరులు



శృంగవరపుకోట: ఎస్.కోటలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సోమేశ్వరరావు, తదితరులు



బొండపల్లి: దేవుపల్లిలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ చలంనాయుడు, జెడ్పీటీసీ సూర్యప్రకాశరావు



గజపతినగరం రూరల్: ముచ్చర్లలో మహిళకు ధ్రువపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ తవుడు, తదితరులు

గ్రామ సచివాలయాలతో సేవలు చేరువ

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, తదితరులు

కొత్తవలస: గ్రామసచివాలయ వ్యవస్థ ద్వార ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువయ్యాయని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని కొత్తవలస మేజర్ పంచాయతీలో సచివాలయం–4 నూతన భవనాన్నిరాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథంతో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, సచివాలయ సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను పరిష్క రించాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పాలనసాగిస్తున్నారని, ఆయన్ని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఎంపీపీ ఎస్.గోపెమ్మ, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చఎర్రారామస్వామి, పీఏసీఎస్ చైర్మన్ గొరపల్లి శివ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి బొంతల వెంకటరావు, ఎంపీటీసీలు పి.అనూష, వి.సూర్యనారాయణశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థికసాయం



రాము కుటుంబానికి నగదు అందజేస్తున్న అతని మిత్రులు

చీపురుపల్లిరూరల్: క్యాన్సర్‌తో బాధపడుతున్న మండలంలోని గచ్చలవలస గ్రామానికి చెందిన యువకుడు రొంగలి రాముకు గరివిడి మండలం బొండపల్లి గ్రామ యువత, పెద్దలు మంగళవారం రూ. 55వేల ఆర్థిక సాయం చేశారు. బాధితుడు రాము ఇటీవలే డిగ్రీ పూర్తి చేసి ఓ ప్రైవేటు ఉద్యోగంలో చేరారు. మోకాళ్ల నొప్పితో మూడు నెలల క్రితం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరగా రెండుసార్లు సర్జరీ చేశారు. మోకాలు వాపు పెరగడంతో వైద్యుల సూచనలతో వైజాగ్‌లోని మహాత్మగాంధీ క్యాన్సర్ హాస్పిటల్‌ను సంప్రదించారు. అక్కడి వైద్యులు పరీక్షలు చేసి బోన్ క్యాన్సర్‌గా నిర్ధారించారు. పేద కుటుంబం కావడంతో వైద్యం చేయించేందుకు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని రాముతో కలిసి చదువుకున్న బొండపల్లి గ్రామానికి చెందిన స్నేహితులకు తెలియడంతో సహాయం చేసేందుకు ముందుకు వచ్చారు. తమతో పాటు గ్రామస్తుల నుంచి సేకరించిన రూ. 55,500 నగదును రాము కుటుంబ సభ్యులకు అందజేశారు. రామును ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని వారు కోరారు.

ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి



వై–20 కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బ్రహ్మకుమారీలు

చీపురుపల్లి: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం కృషిచేయాలని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం చీపురుపల్లి, గరివిడి సేవా కేంద్రాల ఇన్‌చార్జిలు శాంతి, హేమలత సూచించారు. కేంద్ర యువజన సర్వీసుల, క్రీడల మంత్రిత్వశాఖ, బ్రహ్మకుమా రీస్ యూత్ వింగ్ సంయుక్తంగా పట్టణంలోని సత్యరామ డిగ్రీ, గాయత్రీ జూనియర్ కళాశాలల్లో వై–20 సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉన్నప్పుడే ఉన్నత భవిష్యత్ పొందగలరని అన్నారు. సామజిక మాధ్యమాల్లో సమయం వృథా చేయకుండా శ్రద్ధగా చదువుకోవాలని చెప్పారు. నిత్యం యోగా సాధన చేయాలని సూచించారు. సత్యరామ, గాయత్రీ కళాశాలల ప్రతినిధులు జి.ఎ.జగదీష్, డి.శివప్రసాద్ పాల్గొన్నారు.

తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు



ఎస్.కోట మండలం కాశీపతిరాజపురంలో స్పింక్లర్ యూనిట్‌ను పరిశీలిస్తున్న పీడీ లక్ష్మీనారాయణ

శృంగవరపుకోట/ కొత్తవలస: తుంపర సేద్యంతో తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలను సాగు చేయవచ్చని ఏపీ ఎంఐపీ పీడీ పి.ఎస్.వి.లక్ష్మీనారాయణ చెప్పారు. ఎస్.కోట మండలంలో కాశీపతిరాజపురం,ధాంపురం, మల్లిపూడి, కొత్తవలస మండలంలోని వీరభద్రపురం గ్రామంలో రైతులకు రాయితీపై అందించిన తుంపర సేద్యం యూనిట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు రాయితీపై మైక్రో ఇరిగేషన్(డ్రిప్, స్పింకర్లు) పరికరాలను అందిస్తున్నామని తెలిపారు. ఎకరా నుంచి 5 ఎకరాలలోపు ఉన్న రైతులకు 90 శాతం రాయితీపై, 12.5 ఎకరాల లోపు రైతులకు 50 శాతం రాయితీపై పరికరాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఎంఐ ఏఓ మూర్తి, డీసీఓ సురేష్, రాజేష్ ,శ్రావణి సిగ్నెట్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ వై.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

31న చలో కలెక్టరేట్

లక్కవరపుకోట: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 31వ తేదీన చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీఐటీయూ మండల నాయకులు తరిణి వెంకటరమణ తెలిపారు. చలో కలెక్టరేట్ వాల్ పోస్టర్లను మండల కేంద్రంలో మంగళవారం ఆవిష్కరించారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

వేపాడ: మండలంలోని నాలుగు స్కూల్ కాంప్లెక్స్‌ల్లో ఆయా స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ల ఆధ్వర్యంలోఉపాధ్యాయుల సమావేశం మంగళవారం నిర్వహించారు. సమ్మెటివ్–2 నిర్వహణ, జగనన్న గోరుముద్ద పథకం పక్కాగా అమలు, నాడు–నేడు పనులు, బోధన అంశాలు, వెనుకబడిన విద్యార్థులకు అదనపు తరగతుల నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. స్కూలు కాంప్లెక్స్ చైర్మన్‌లు వెంకటరమణ, బి.పి.ఎ. రాజు, వల్లి పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ పోస్టర్ల ఆవిష్కరణ

వేపాడ: స్వచ్ఛ భారత్ మిషన్ మండల కో–ఆర్డినేటర్ రాంబాబు ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023 వాల్ పోస్టర్లను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ మంగళవారం ఆవిష్కరించారు. ప్రత్యేకాధి కారి మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున గ్రా మాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని సూచించారు. ఎంపీడీఓ పట్నాయక్, తహసీల్దార్ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

31 నుంచి ఎస్‌ఎఫ్‌ఐ సైకిల్ యాత్ర

గజపతినగరం: విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్న డిమాండ్‌తో ఈనెల 31వ తేదా ఆగస్టు 9వ తేదీ వరకు జిల్లాలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర నిర్వహించనున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాము తెలిపారు. సంబంధిత వాల్‌పోస్టర్లను గజపతినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మంగళవారం ఆవిష్కరించారు. కొత్తవలసలో సైకిల్ యాత్ర ప్రారంభించి గజపతినగరం వరకు చేపడతామని ఆయన చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు,కళాశాలల్లో అవసరమైన చోట భవనాలు నిర్మించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కూర్మారావు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం

మెరకముడిదాం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. ఊటపల్లిలో సర్పంచ్ సంగంరెడ్డి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో 'గడపగడపకు మనప్రభుత్వం'ని ర్వహించారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, కె.ఎ స్.ఆర్.ప్రసాద్, ఎంపీడీఓ ఎం.రత్నం, తహసీల్దార్ విజయభాస్కర్ ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను ఆరా తీశారు.

రైతుని శాస్త్రవేత్తగా మార్చడమే లక్ష్యం

జామి: రైతుని శాస్త్రవేత్తగా మార్చడమే పొలంబడి లక్ష్యమని రైతు శిక్షణకేంద్రం ఏడీ.డి.భారతి అన్నారు. లక్ష్మీపురం గ్రామంలో ఏఓ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మిత్రపురుగుల సంరక్షణ, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే విధానం, తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. పురుగుల మందుల అధిక వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. వరి నారు చిగుర్లు తుంచి నాటాలని చెప్పారు. పొలంగట్లపై సాగుచేసేందుకు రైతులకు ఉచితంగాకంది విత్తనాలు పంపిణీ చేశారు.వీపీఏ కరీమ్, గ్రామపెద్ద దేముడు పాల్గొన్నారు.

సబ్జెక్టుపై పట్టు సాధించాలి

చీపురుపల్లి: విద్యార్థులు సబ్జెక్టుపై పట్టు సాధించేలా ఉపాధ్యాయుల బోధన ఉండాలని డైట్ లెక్చరర్ ఎల్.రామకృష్ణ అన్నారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ఇంగ్లిష్, గణితం, సైన్స్ సబ్జెక్టుల బోధనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎంఈఓ ఎం.బూసినాయుడు, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ కె.చంద్రశేఖర్ కుమార్ పాల్గొన్నారు.

యూనిఫాం దుస్తుల వితరణ

శృంగవరపుకోట: ధర్మవరం ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సర విద్యార్థినులకు అక్కడి తెలుగు భాషోపాధ్యాయుడు రహీం షేక్‌లాల్ యూనిఫాం దుస్తులను మంగళవారం అందజేశారు. తన సోదరి హూరానీ బేగం జ్ఞాపకార్థం విద్యార్థినులకు యూనిఫాం దుస్తులు అందజేసినట్లు ఉపాధ్యాయుడు తెలిపారు. ఎంఈఓ–2 పి.జి.లక్ష్మి, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ తగరంపూడి రమణ, హెచ్ఎం ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.